

బ్యాంకాక్‌కు విమాన సర్వీస్

విశాఖ: విమాన ప్రయాణికులకు శుభవార్త. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. 10లో



పోటెత్తిన భక్తజనం

అనకాపల్లి జిల్లా యలమంచిలిలో నల్లమారమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. భారీగా జనం తరలివచ్చారు. 10లో



విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. 10లో

న్యూస్‌రీల్

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల రోడ్‌షో

గంగవరం : మండలంలోని ఓజుబంద నుంచి మొల్లేరు వరకు బుధవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు వైఎస్సార్ వాహన యాత్ర (రోడ్‌షో) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

సర్వే అసిస్టెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో స్వల్ప వ్యవధి కోర్సులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. విద్యార్హత పదవ తరగతితోపాటు వయసు 15 ఏళ్లకు పైబడి ఉండాలన్నారు. సర్వేయింగ్ అసిస్టెంట్ (సివిల్)కోర్సులో మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రూప్-2 స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ రమేష్, తహసీల్దారు తిరుమలరావు తదితరులు

కొయ్యూరు: యువత పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఎంపీపీ బడుగు రమేష్, తహసీల్దార్ తిరుమలరావు కోరారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ తండ్రి కృష్ణారావు జ్ఞాపకార్థం 35 మందికి అవసరమైన గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. వీటిని మంగళవారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-2లో విద్యార్థులకు డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీపీ, బడుగు రమేష్, తహసీల్దార్ తిరుమలరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, ఏఎస్‌వో చైతన్య, వార్డెన్ దుమంతి వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అడ్డతీగలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాత్ కుమార్

అడ్డతీగల: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ నాటికి కేంద్రాల వద్ద పరిస్థితిపై పర్యవేక్షణ అవసరమని రంపచోడవరం సబ్‌కలెక్టర్ జి.ప్రశాంత్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం అడ్డతీగలలో పలు చోట్ల పోలింగ్ కేంద్రాల్లో కొన్నింటిని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ తాతారావుకు సూచించారు. అనంతరం భీముడుపాకలు వైపు జాతీయ రహదారి 516ఇ పనులను పరిశీలించారు. రహదారి నిర్మాణానికి సేకరించాల్సిన భూ వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.

ఘనంగా అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

25న సహస్ర తులసిపూజ..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

పాడేరు టీడీపీలో గ్రూపుల లొల్లి

పాడేరు నియోజకవర్గంలో టీడీపీ నేతల వ్యవహారశైలి తలోదారి అన్నట్టుగా ఉంది. గత 20 ఏళ్లుగా ఉనికే లేని ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు తారస్థాయికి చేరడంతో అధిష్టానానికి మింగుడు పడటం లేదు. పార్టీ ప్రధాన నేతలంతా ఐదు వర్గాలుగా విడిపోయారు. వీరంతా వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడం తలనొప్పిగా మారింది.



- వెలుగులోకి వర్గపోరు.. క్యాడర్ తలోదారి
- ఐదు గ్రూపులుగా విడిపోయిన నేతలు
- ఎవరికి వారే కార్యక్రమాల నిర్వహణ
- అసెంబ్లీ టికెట్ కోసం సిగపట్లు

పాడేరు : జిల్లాలో వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉన్న పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో పెరుగుతున్న గ్రూపులు, వర్గాలతో టీడీపీ మరింత దీన స్థితికి చేరుకుంటోంది. 2004 నుంచి నియోజకవర్గంలో ఆ పార్టీ ఉనికి లేకుండా పోయింది. సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆ పార్టీ ప్రభావం నామమాత్రమే అయ్యింది. గత 20 ఏళ్లలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ గెలుపొందలేదు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డి ఈశ్వరి మాత్రం పార్టీ ఫిరాయించి 2017లో టీడీపీలో చేరారు. ఆ రెండేళ్ల మాత్రమే వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేను తమ ఎమ్మెల్యేగా చెప్పుకొని టీడీపీ నేతలు కాసింత సంతృప్తి చెందారు.

గిడ్డికి ఓటుతో బుద్ధి

టీడీపీ తరఫున 2019 ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి గిరిజనులు ఓటుతో బుద్ధి చెప్పడంతో ఘోర పరాజయం పాలయ్యారు. అప్పటికే టీడీపీలో మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, పార్టీ సీనియర్ నాయకుడు బొర్రా నాగరాజు వర్గాలు ఉండేవి. గిడ్డి ఈశ్వరి రాకతో మరో వర్గం తయారైంది. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఆమెకు ముందున్న వర్గాలు ఏ మాత్రం సహకరించనందునే ఓటమి పాలయ్యారన్న ప్రచారం స్థానికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మరో కొత్త వర్గం పుట్టుకొచ్చింది.

'కిల్లు' చేరికతో మరో వర్గం..

పాడేరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కిల్లు వెంకటరత్నం కుమారుడు కిల్లు వెంకటరమేష్ నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. తాను కూడా టీడీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఆయన తన వర్గాన్ని తయారు చేసుకుంటున్నారు. ఇప్పటికే వర్గాలు, గ్రూపు రాజకీయాలతో సతమతమవుతున్న టీడీపీకి ఇప్పుడు కిల్లు వెంకట రమేష్ నాయుడు వర్గంతో కొత్త చిక్కు వచ్చి పడింది. మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు ఎంవీవీ ప్రసాద్ కూడా మరో గ్రూప్‌గా ఏర్పడ్డారు. వీరంతా ఎవరి వారు పాడేరు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో వీరిలో ఎవరికి సీటు వచ్చినా మిగతా వర్గాలు పనిచేసే పరిస్థితి ఉండదని పలువురు విశ్లేషిస్తున్నారు.

ఒంటెద్దు పోకడలతో..

పాడేరు నియోజకవర్గంలో అంతగా ఉనికి లేని టీడీపీలో సమన్వయం పూర్తిగా కొరవడింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తమను పక్కనబెట్టి ఒంటెద్దు పోకడలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సీనియర్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు గ్రూపులుగా విడిపోయారు. మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, పార్టీ సీనియర్ నేత బొర్రా నాగరాజు ఒక గ్రూపుగా, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మరో గ్రూపుగా ఏర్పడి పాడేరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు. గిడ్డి ఈశ్వరి వ్యవహార శైలిపై అదే రోజు మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి విమర్శలు చేశారు. ఆమె సీనియర్లను పట్టించుకోవడం లేదని.. ఇలాగైతే పార్టీకి ఇబ్బందని బహిరంగంగా ధ్వజమెత్తారు.

లోకేష్ బర్త్‌డే వేదికగా..

నారా లోకేష్ జన్మదిన వేడుకల్లోనూ టీడీపీ నేతలు గ్రూపులుగా విడిపోయారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తన అనుచరులతో మోదకొండమ్మ గుడి వద్ద, ఇటీవల పార్టీలో చేరిన కిల్లు వెంకటరమేష్ నాయుడు తన అనుచరులతో ఎన్టీఆర్ విగ్రహం వద్ద వేర్వేరుగా నిర్వహించారు. ఇక మిగిలిన నాయకులు నిర్వహించారో లేదో తెలియని పరిస్థితి. ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఉన్న కొద్ది పాటి క్యాడర్ కూడా ఎవరి వైపు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

మహిళా సాధికారితకు అధిక ప్రాధాన్యం



స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- స్వయం సహాయక సంఘాలకు ఆసరా సొమ్ము జమ
- జిల్లాలో 85,167 మంది సభ్యులకు రూ.34.06 కోట్ల మేర లబ్ధి



హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

పాడేరు: మహిళల సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత ఆసరా నగదు విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 85,167 మంది సభ్యులున్న 8664 స్వయ సహాయక సంఘాల పొదుపు ఖాతాలకు రూ.34.06 కోట్లు ఆసరా నగదును సీఎం జమచేశారన్నారు. ఈ మొత్తాన్ని మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. అరకు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని 2295 స్వయం సహాయక సంఘాలకు రూ.7.67కోట్లు, పాడేరు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లోని 1521 స్వయం సహాయక సంఘాలకు రూ.6.25కోట్లు, రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో 4848 స్వయం సహాయక సంఘాలకు రూ.20.14కోట్లు జమ అయిందన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళల ఆర్థిక పురోగతికి వైఎస్సార్ ఆసరా సొమ్ము ఉపయోగపడుతుందన్నారు. అసరా సొమ్మును వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టిబడి మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేస్తున్నారన్నారు. మహిళలంతా సీఎంకు కృతజ్ఞతగా ఉండాలని కోరారు. డీఆర్‌డీఏ పీడీ మురళి, వెలుగు ఉద్యోగులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు/అరకు రూరల్ : పాడేరు, అరకులో న్యాయ సహాయకులు (పారా లీగల్ వలంటీర్లు)గా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 31 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్హత, ఆధార్ కార్డుతోపాటు, పాసుపోర్టు సైజ్ ఫొటో, కుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జతచేసి అరకులోయ, పాడేరు కోర్టుల్లోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాల్లో అందజేయాలని ఆమె కోరారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఉండాలన్నారు. వివిధ సంస్థల్లో పనిచేసి ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు ఎటువంటి వేతనం, పారితోషికం ఉండదన్నారు. పూర్తి వివరాలకు కోర్టుల వద్ద గల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

బాధితులందరికీ నష్ట పరిహారం

రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్



పెద్దఅడ్డపల్లిలో అధికారులతో చర్చిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

గంగవరం : జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ నష్టపరిహారం అందజేస్తామని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పర్యటించారు. జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న పెద్దఅడ్డపల్లిలోని చినబాబు, బాలాబ్బాయిలకు చెందిన ఇళ్లు, దుకాణాలను, రికార్డులను ఆయన పరిశీలించారు. దీనిపై నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని వారికి సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఆర్‌ఐ ఫయాజ్ భాషా, మండల సర్వేయర్ దొర, గ్రామ సర్వేయర్ చిన్ని కృష్ణ, వీఆర్వో కె. వెంకటేశ్వర్లుదొర పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్డుతో దాడి

పాత కక్షల నేపథ్యంలో ఘటన



గాయపడిన రాజ్‌కుమార్

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ మేభ గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై దాడి జరిగింది. మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేభ గ్రామానికి చెందిన కొచ్చో రాజ్‌కుమార్ అనే గిరిజనుడు సామగ్రి కొనుగోలు నిమిత్తం మంగళవారం ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరాడు. ఇదే సమయంలో అతనిపై అదే గ్రామానికి చెందిన కొచ్చో కామరాజు అనే వ్యక్తి దారి కాచి ఇనుపరాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. దీనిని గమనించిన స్థానికులు గాయపడిన రాజ్‌కుమార్‌ను హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకురావడంతో వైద్య సేవలందించారు. గత 2018లో కుటుంబాల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో కక్షతో కామరాజు అనే వ్యక్తి తనపై దాడికి పాల్పడ్డాడని బాధితుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



ఐదు రకాల చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



చామంతులు, బంతిపూల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస (భీమిలి): జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అయిదు రకాల చామంతులతో అలంకరించారు. ఈ అలంకరణకు ఆదర్శనగర్‌కు చెందిన మొక్క అప్పలరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందన దుంప శంకరరావు అలంకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబను చామంతులు, బంతిపూలతో అలంకరించారు. ఈ అలంకరణకు సరగడ సూరి, సూరమ్మ దంపతులు సహకరించగా తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.
- భీమిలి మండలం తాటితూరు గ్రామదేవత పైడితల్లమ్మను బిస్కట్లతో వేమన రెడ్డి సంఘం సహకారంతో అలంకరించారు.

వెంటాడిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం
- కుమార్తెను స్కూల్ వద్ద దింపి వస్తుండగా ప్రమాదం
- గొప్పులపాలెంలో విషాదఛాయలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



ప్రమాదానికి కారణమైన కారు



నుజ్జయిన బైక్

జి.మాడుగుల: కుమార్తెను బైక్‌పై స్కూల్‌కు తీసుకువెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న వ్యక్తిని మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాద రూపంలో కబళించింది. పాడేరు వెళ్లే మార్గంలో కె.కోడాపల్లి పంచాయతీ కవలుపూలు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామానికి చెందిన జగందొర అర్జున్ (35) బైక్‌పై కుమార్తెను మంగళవారం ఉదయం పెదబయలులోని పాఠశాలకు తీసుకువెళ్లాడు. అక్కడ విడిచిపెట్టిన అనంతరం తిరిగి వస్తుండగా కవలుపూలు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అర్జున్ అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు పర్యాటకులకు చెందినదిగా తెలిసిందన్నారు. కారులో ఉన్న వారు, డ్రైవర్ పరారయ్యారని చెప్పారు. వారికోసం గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అర్జున్ మృతితో కవలుపూలు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇలావుండగా ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడు అర్జున్ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. అర్జున్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

భద్రత.. భరోసా

- ప్రమాదాల నివారణకు ఈపీడీసీఎల్ ప్రయత్నాలు
- 2018 నుంచి 2023 వరకూ 931 విద్యుత్ ప్రమాదాలు
- ప్రమాద బాధితులకు రూ.27.11 కోట్ల పరిహారం చెల్లింపు
- ప్రమాదంలో మృతి చెందిన 475 మంది కుటుంబాలకు రూ.24.13 కోట్లు
- పరిహారం చెల్లింపులో ప్రథమ స్థానంలో ఈపీడీసీఎల్



ఈపీడీసీఎల్ రూపొందించిన అవగాహన రథం

2018 నుంచి 2023 వరకు జరిగిన విద్యుత్ ప్రమాదాలు	931
అందించిన పరిహారం	రూ.27.11 కోట్లు
విద్యుత్ ప్రమాదానికి గురైన మనుషులు	475 మంది
వారికి అందించిన పరిహారం	రూ.24.13 కోట్లు
విద్యుత్ ప్రమాదాల బారిన పడిన జంతువులు	456
వాటికి అందించిన పరిహారం	రూ.2.98 కోట్లు
విద్యుత్ ప్రమాద సమయాల్లో సంప్రదించాల్సిన ఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నం	1912

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపులో ఏపీఈపీడీసీఎల్ ముందు వరుసలో నిలుస్తోంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) నిర్దేశించిన సూచనల మేరకు సకాలంలో పరిహారం చెల్లిస్తోంది. ప్రమాద కారణాలను త్వరితగతిన విచారించి మరణించిన, వైకల్యానికి గురైన మూగజీవాలు, మనుషులకు అండగా ఉంటోంది. గత ఐదేళ్లలో ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో 931 మంది మనుషులు, జంతువులు విద్యుదాఘాతానికి గురవ్వగా.. వీరికి రూ.27.11 కోట్ల మేర పరిహారాన్ని అందించింది.

డిస్కమ్‌లదే బాధ్యత

విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపులో అనుసరిస్తున్న నిబంధనల విషయంలో వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త నిబంధనలను నిర్దేశిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్స్ ప్రకారం విద్యుత్ ప్రమాదం ఎలా జరిగినా.. బాధ్యులెవరైనా సంబంధిత విద్యుత్ సంస్థలే పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. వినియోగదారుల నివాస సముదాయాల్లోనూ, విద్యుత్ వినియోగించే ప్రతిచోటా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కచ్చితంగా తనిఖీలు చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు అవగాహన

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈపీడీసీఎల్ కొత్తగా ప్రయత్నిస్తోంది. గృహ వినియోగదారులు, పారిశ్రామిక వినియోగదారులకు భద్రత ప్రమాణాలు ఎలా పాటించాలన్న అంశాలు గుర్తుండిపోయేలా ప్రత్యేక వాహనాన్ని రూపొందించింది. విద్యుత్ భద్రత అవగాహన రథాన్ని ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక బృందాల్ని ఏర్పాటుచేసి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తోంది.

జాగ్రత్తలతోనే ప్రమాదాలు దూరం



ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురైన కుటుంబాల్ని ఆదుకుంటున్నాం. వినియోగదారులు చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఎంతో మేలు. విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, పరికరాలను ఐఎస్‌ఐ గుర్తింపు ఉన్న వాటిని ఉపయోగించాలి. ఇంట్లో స్విచ్ బోర్డులను తగినంత ఎత్తులో అమర్చాలి. ప్రతీ ఇంటి విద్యుత్ సర్వీసుకు, ఇంట్లో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి. విద్యుత్ సర్వీసు కోసం తగు కెపాసిటీ ఉన్న వైరు వాడాలి. వ్యవసాయ వినియోగదారులు కొబ్బరి, పామాయిల్ తోటలలో కొమ్మలు తొలగించేటప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బందికి కచ్చితంగా సమాచారం ఇవ్వాలి. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు భద్రతా నియమాలు పాటించాలి.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

క్లుప్తంగా

విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

లైంగికదాడికి యత్నించిన వైద్యుడు అరెస్ట్

అల్లిపురం: బాలికపై లైంగికదాడికి యత్నించిన డాక్టర్‌ను మహారాణిపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం... డబ్బులు తీసుకునేందుకు బీచ్‌రోడ్డులోని డాక్టర్ భవానీ శంకర్ గెస్ట్‌హౌస్‌కు రావాలని అనకాపల్లికి చెందిన 15 ఏళ్ల బాలికకు గత ఏడాది నవంబర్ 19న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రెడ్డి సూర్యారావు అనే వైద్యుడు ఫోన్ చేశాడు. బాలిక అక్కడకు వచ్చాక లైంగికదాడికి యత్నించాడు. అనంతరం విషయం తెలుసుకుని బాలిక తల్లి మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వైద్యుడు రెడ్డి సూర్యారావును మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'కిల్కారీ'తో సకాలంలో వైద్య సేవలు



అవగాహన సదస్సులో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

రంపచోడవరం: కిల్కారీ వ్యవస్థతో ఏజెన్సీలో గర్భిణులు, బాలింతలు సకాలంలో వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాశం అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం కిల్కారీ సర్వీసెస్‌పై ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రోగ్రామ్ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాలు, ఇతర వైద్యసేవలకు సంబంధించి గర్భిణులు, బాలింతలను వాయిస్ మెసేజ్ ద్వారా నిత్యం అప్రమత్తం చేస్తుందని తెలిపారు. మొదటి విడత అవగాహన కార్యక్రమంలో గంగవరం, పిడతమామిడి, చవిటిదిబ్బలు, ఎల్లవరం, రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. హెచ్‌ఈవో కె.పీటర్, హెచ్‌ఈ ఝాన్సీ పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర సూపర్

ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి.. అని చేపల ప్రియులు ఆస్వాదించే వార్త..


కష్టపడి వేటాడిన మత్స్యసంపదకు చక్కని మార్కెట్ లభించడంతో గంగపుత్రులు ఆనందించే సందర్భం..

జిల్లాలో ఇప్పటికే 85 ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లను ప్రారంభించిన మత్స్య శాఖ.. త్వరలో నాలుగు సూపర్ షాప్‌లకు శ్రీకారం చుట్టనుంది. మరో రెండు లాంజ్‌లను ఏర్పాటు చేయనుంది. మినీ ఔట్‌లెట్లలో చేపలు విక్రయించగా.. కొత్తగా ప్రారంభించనున్న సూపర్ షాప్‌లలో లైవ్ ఫిష్‌తోపాటు చేపలతో తయారు చేసే వంటకాలను విక్రయిస్తారు. లాంజ్‌లు రెస్టారెంట్లుగా భోజన ప్రియులకు ఆతిథ్యమివ్వనున్నాయి.

- అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే 85 ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లు
- త్వరలో ప్రారంభం కానున్న నాలుగు సూపర్ షాప్‌లు
- సిద్ధమవుతున్న మరో రెండు లాంజ్‌లు



ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లు









చేపలను పరిశుభ్రంగా కటింగ్ మిషన్‌తో ముక్కలుగా చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మత్స్యకారులకు అండగా ఉంటూ.. మత్స్య సంపదను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో వేలాదిమంది మత్స్యకారుల తలరాత మారుతోంది. అంతేకాకుండా ఆహారంలో కీలక పోషకాలు ఉన్న చేపల ఉత్పత్తి, అమ్మకాలకు మరిన్ని మంచి రోజులు వస్తున్నాయి. ఫిష్ ఆంధ్ర నినాదంతో ఇప్పటికే మినీ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉండగా.. అదనపు హంగులతో చేపల షాపులను ఏర్పాటు చేసే దిశగా ఆ శాఖ అడుగులు వేస్తోంది.

అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలో 31 మత్స్యకార గ్రామాలు, 12 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. సుమారు 11 వేల 116 మందికి పైగా మత్స్యకారులు జిల్లాలో ఉన్నారు. ప్రభుత్వ చర్యలతో చేపల వేటపై ఆధారపడిన వారికి మేలు చేకూరనుంది. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో నాలుగు సూపర్ షాపులు

అన్ని గ్రామాలు, పట్టణాల్లో చేపల విక్రయానికి ఏర్పాటు చేస్తున్న ఫిష్ మినీ ఆంధ్ర షాపులు జిల్లాలో 85 ఉన్నాయి. దీంతో సముద్ర తీరప్రాంతాల్లోనూ, రిజర్వాయర్, నదులు, సరస్సులు, చెరువుల్లో లభించే వివిధ రకాల చేపలకు చక్కని మార్కెటింగ్ సదుపాయం దక్కింది. ఈ క్రమంలోనే జిల్లాలో సూపర్ షాపులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో షాపును నెలకొల్పేందుకు రూ.20 లక్షల పెట్టుబడి అవసరం. ప్రభుత్వం 40 సబ్సిడీని భరిస్తుంది. ముందుగా అచ్యుతాపురంలో ఒక షాపును, చోడవరంలో మరో షాపును ఏర్పాటు చేయనున్నారు.

ఇక సూపర్ షాపులకు దీటుగా లాంజ్‌లను సైతం రూ.50 లక్షలతో జిల్లాలో రెండు ఏర్పాటు చేయనున్నారు. వీటిని అనకాపల్లి హైవేలో ఏర్పాటు చేయనున్నారు. వేల్యూ యాడ్ చేసి హైజనిక్‌గా చేపల విక్రయం చేపట్టనున్నారు. దిగువ స్థాయి ప్రజల నుంచి ఉన్నత స్థాయి వర్గాల వారికి అవసరమైన 10 రకాల చేపలు సూపర్, లాంజ్‌లలో దొరకనున్నాయి.

'సూపర్' ప్రత్యేకతలివే...

సముద్ర, చెరువు చేపలకు సంబంధించిన శీలావతి, పచ్చబోసు, సముద్ర రకాలు చందువ, కోనాలు, వంజరం వంటి చేపలను లైవ్‌లో అమ్ముతారు. ఇక్కడే ఐస్ తయారీ వ్యవస్థ ఉన్నందున చేపలు ఫ్రెష్‌గా ఉంటాయి. అవసరమైతే ప్యాక్ చేసిన చేపలను అమ్ముతారు. చేపల కట్‌లెట్‌లు, ఫ్రైలు విక్రయిస్తారు.

రెస్టారెంట్‌గా లాంజ్‌లు...

లాంజ్‌లు దాదాపు రెస్టారెంట్ తరహాలో ఉంటాయి. చేపలకు సంబంధించిన అన్ని వంటకాలు ఇక్కడ విక్రయిస్తారు. చేపల స్టార్టర్లు, పులుసులు, చేపల బిర్యానీ, చేపల అన్నం, చేపలతో కూడిన అన్ని రకాల ఆహార పదార్థాలను ఇక్కడ రెస్టారెంట్ తరహాలో వినియోగదారునికి అందిస్తారు.

అందుబాటులో విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులు



జిల్లాలో ఫిష్ మినీ ఆంధ్రాలకు తోడు మరో నాలుగు సూపర్ షాపులను ఏర్పాటు చేయనున్నాం. అచ్యుతాపురంలో ఒకటి, చోడవరంలో మరొకటి నెలకొల్పుతున్నాం. రూ.20 లక్షలతో ఏర్పాటు చేసే సూపర్ షాప్‌లతో ఫిషింగ్ వేల్యూ యాడ్ చేస్తాం. షాపు ఏర్పాటులో మత్స్యకారునికి 40 శాతం సబ్సిడీ ఇస్తాం.

– ప్రసాదరావు, జిల్లా మత్స్య శాఖ ఏడీ

ఆర్టీసీకి హ్యాపీ సంక్రాంతి!

- రూ.కోటిన్నరకు పైగా రాబడి
- గత ఏడాదికంటే రూ.12 లక్షల అధిక ఆదాయం
- ఈనెల 28 వరకు అదనపు బస్సులు



విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీకి సంక్రాంతి సంతోషాన్నిచ్చింది. ఈ ఏడాది ఊహించిన దానికంటే అధిక ఆదాయాన్ని ఆర్జించింది. ఈనెల ఎనిమిదో తేదీ నుంచే సంక్రాంతి రద్దీ మొదలైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ జిల్లా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను అందుబాటులోకి తెచ్చారు. 765 సంక్రాంతి స్పెషల్ సర్వీసులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 22వ తేదీ వరకు నడిపారు. వీటిలో జోన్–1 నుంచి హైదరాబాద్‌కే 120కి పైగా బస్సులను తిప్పారు. గత సంక్రాంతికి కేవలం 60 బస్సులనే నడపగా ఈసారి వాటిని రెట్టింపు చేశారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించడంతో ఎక్కువ బస్సులను అక్కడ అవసరాలకే కేటాయించారు. ఫలితంగా సంక్రాంతికి టీఎస్‌ఆర్టీసీ బస్సుల కొరతతో ఆంధ్రప్రదేశ్ వైపు స్పెషల్ సర్వీసులను గణనీయంగా తగ్గించింది. దీంతో ఏపీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్–విశాఖపట్నంల మధ్య ఎక్కువ సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేసింది. ఈ ప్రయత్నం బాగా ఫలించి మంచి ఆదాయాన్ని సమకూర్చింది. గత సంక్రాంతికి విశాఖ జిల్లా నుంచి 745 స్పెషల్స్‌ను నడపగా.. ఈ సంవత్సరం 20 బస్సులను అదనంగా వెరసి 765 స్పెషల్స్‌ను నడిపారు. వీటిలో సంక్రాంతికి ముందు 472, తర్వాత 293 సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. వీటిని ప్రయాణికుల డిమాండ్, రద్దీకి అనుగుణంగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, శ్రీకాకుళం, పార్వతీపురం, పలాస, పాలకొండ, రాజాం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు తదితర ప్రాంతాలకు ఎక్కువ సర్వీసులు తిప్పారు. ఈ స్పెషల్ బస్సుల ద్వారా సంక్రాంతి దాకా రూ.79,81,655, అనంతరం రూ.74,64,119 వెరసి రూ. 1,54,45,774 రాబడి వచ్చింది. గత సంక్రాంతికి రూ.1,41,57,400 ఆదాయాన్ని ఆర్జించింది. అంటే గత సంక్రాంతికంటే సుమారు రూ.12 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందన్న మాట!

పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

మరోవైపు ఈ సంక్రాంతికి ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) కూడా బాగానే పెరిగింది. గతేడాది ఓఆర్ 62 శాతం ఉండగా ఇప్పుడది 67 శాతానికి చేరింది. కిలోమీటరుకు రూ.42.90 ఆదాయం సమకూరింది. కాగా సంక్రాంతి పండగకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే వారిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 28వ తేదీ వరకు స్పెషల్ సర్వీసులను నడుపుతామని విశాఖ జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

సంక్రాంతికి స్పెషల్ బస్సుల వివరాలు ఇలా..

వివరం	నడిపిన స్పెషల్స్	ఆదాయం (రూ.లలో)	ఓఆర్ (శాతం)
2024 సంక్రాంతికి ముందు	472	79,81,655	61
2023 సంక్రాంతికి ముందు	529	84,44,795	61
2024 సంక్రాంతి తర్వాత	293	74,64,119	73
2023 సంక్రాంతి తర్వాత	216	57,12,605	66
2024 సంక్రాంతికి	765	1,54,45,774	67
2023 సంక్రాంతికి	745	1,41,57,400	62

రూ.51.72 లక్షలకు పాదరక్షలు భద్రపరిచే వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వ్యాపారాల నిమిత్తం లీజు హక్కులు ఇచ్చేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. సింహగిరిపై భక్తుల పాదరక్షలు భద్రపరిచేందుకు నిర్వహించిన వేలంపాట సంవత్సరం కాల పరిమితికిగాను 51,72,116 హెచ్చుమొత్తానికి వెళ్లింది. అలాగే కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని షాపు నెంబర్ ఒకటి నెలకు రూ.11,900, ఏడో నెంబర్ షాపు రూ.11,601, 11వ నెంబర్ షాపు రూ.11,900, 12వ నెంబర్ షాపు రూ.11,300, 13, 14 షాపులు రూ.11 వేలు చొప్పున అద్దెకు హెచ్చుపాటలు పాడారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఏఈవోలు పాలూరి నరసింగరావు, రమణమూర్తి, సిబ్బంది దొంతల రమణ, దేవదాయశాఖ ఉద్యోగి నీలిమ వేలంపాటలు నిర్వహించారు.

బస్సుల్లో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి నగరం వైపు ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న గంజాయి రవాణాకు మంగళవారం పెందుర్తి పోలీసులు చెక్ పెట్టారు. వేర్వేరు బసుల్లో గంజాయి తరలిస్తున్న మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసి.. వారి నుంచి 31 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. అరకు ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలిస్తున్నట్లు పెందుర్తి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై పెందుర్తి మండలం సరిపల్లి వద్ద సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసుల నిఘా ఉంచారు. ఒక ఆర్టీసీ బస్‌లో 8 కిలోల గంజాయిని తరలిస్తున్న నిందితులు అరుముగం నారాయణ్, ఆర్య సోమయాజుల సాయి, మణి నంద కుమార్‌లను, మరో బస్‌లో 23 కిలోల గంజాయిని తరలిస్తున్న చుంచు రాజు, షాహూ, సునీష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

పోటెత్తిన భక్తజనం

- అంగరంగ వైభవంగా నల్లమారమ్మ జాతర



నల్లమారమ్మను దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నల్లమారమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. బాణాసంచా వెలుగులు, నృత్య ప్రదర్శనలు, మహిళల కోలాటాలు, తప్పెట గుళ్లు, సాము గరిడీలు, చెక్క భజనలు, నేల వేషాలు, బంధుమిత్రుల సందడి.. వెరసి అమ్మవారి జాతర సందర్భంగా షేకిళ్ల పాలెం జన సంద్రంగా మారింది. నల్లమారమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఇక్కడ వేపచెట్టు, పుట్ట రూపంలో ఉన్న అమ్మవారికి పసుపు, కుంకుమ చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సీఐ షేక్ గపూర్, ఎస్‌ఐలు పాపినాయుడు, రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఎటువంటి అవంతరాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

బ్యాంకాక్‌కు విమాన సర్వీస్

- ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం

విశాఖ: విమాన ప్రయాణికులకు శుభవార్త. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 16 నుంచి మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ఎయిర్ ఏసియా ప్రకటించింది. బ్యాంకాక్‌లో రాత్రి 10.05 గంటలకు ఈ విమానం బయలుదేరి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖలో 11.50 గంటలకు బయలుదేరి.. తెల్లవారుజాము 4.15గంటలకు(భారత కాలమానం ప్రకారం) బ్యాంకాక్ వెళ్తుంది. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా వెళ్లే వారికి ఈ విమాన సర్వీసు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పటివరకు విశాఖ నుంచి సింగపూర్‌కి మాత్రమే విదేశీ విమాన సర్వీసు అందుబాటులో ఉంది. బ్యాంకాక్ సర్వీసు మొదలైతే.. ఈ జాబితాలో మరో విదేశీ విమాన సర్వీస్ చేరుతుంది.

నేడు జాబ్‌మేళా

మురళీనగర్ (విశాఖ): యువతకు ఉద్యోగ కల్పనకు ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్‌లో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దువ్వాడలోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమా మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ, ఐటీఐ, బీటెక్ లేదా ఎంటెక్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ కోర్సులు పూర్తి చేసిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయానికి నేరుగా 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికై న వారికి వారి అర్హతను ఆధారంగా రూ.12,000 నుంచి రూ.20,000ల వరకు వేతనం చెల్లిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 9292553352 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

చెత్తలో హోంగార్డ్ టోపీ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చెత్తలో హోంగార్డు టోపీ

సీతమ్మధార(విశాఖ): హోంగార్డుతలపై ఉండాల్సిన టోపీ చెత్తకుప్పలో ఉండటం పలువురిని ఆశ్చర్యపరిచింది. జీవీఎంసీ గాంధీ పార్కులోని ఒక చెట్టు పక్కన చెత్తలో టోపీ పడి ఉంది. ఆ ప్రాంతంలో ప్రతి రోజు పోలీసులు, హోంగార్డులు, కానిస్టేబుళ్లు, అధికారులు, ఎస్‌ఐలు, సీఐలు విధులు నిర్వహిస్తుంటారు. అయితే హోంగార్డు టోపీ మరిచిపోయి చెత్తలో పడి ఉన్నా ఎవరూ పట్టించుకోలేనట్లు తెలుస్తోంది.

ఎస్‌బీఎం విభాగంలో రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం) విభాగంలో బుధవారం రాత్రి షిఫ్ట్‌లో 815 టన్నుల రికార్డు ఉత్పత్తి జరిగింది. ఇంతకు ముందు 2023 నవంబర్ 27న నైట్ షిఫ్ట్‌లో అత్యధికంగా 791 టన్నులు అత్యధిక ఉత్పత్తి జరగ్గా ఇప్పుడు అంత కంటే ఎక్కువగా ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేసింది.